ఆర్టీఎఫ్‌ఎంఎస్‌తో విద్యుత్ మానిటరింగ్



ఆర్‌టీఎఫ్ఎంఎస్‌ను ప్రారంభిస్తున్న ఎంఆర్‌టీపీ డీఈ సదానందం


కాటారం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్‌టీఎఫ్ఎంఎస్)తో విద్యుత్ మానిటరింగ్ సులభతరమవుతుందని, భూపాలపల్లి సర్కిల్ ఎంఆర్‌టీపీ డీఈ సదానందం అన్నారు. మండలంలోని ధన్వాడ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్‌టీఎఫ్ఎంఎస్‌లో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఆటోమేషన్ సిస్టమ్‌ను సోమవారం ఎంఆర్‌టీపీ, ట్రాన్స్‌కో విభాగాల అధికారులతో కలిసి ప్రారంభించారు. ఆర్‌టీఎఫ్ఎంఎస్‌తోనాణ్యమైన విద్యుత్‌ను అందించడం, సబ్‌స్టేషన్ల నిర్వహణ సామర్థ్యం పెరుగుతుందన్నారు.

ఆర్టీఎఫ్ఎంఎస్ ద్వారా విద్యుత్ వినియోగదారులకు అత్యంత నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని, సరఫరా సమయాల్లో నెలకొన్న సమస్యలను రియల్ టైమ్ డేటా ద్వారా తెలుసుకుని పరిష్కారం చేయొచ్చని తెలిపారు. విద్యుత్ ఫీడర్ల నిర్వహణ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో, ఎంఆర్‌టీపీ ఏడీఈలు నాగరాజు, ప్రశాంత్‌రెడ్డి, ఎల్ఐ కిరణ్‌కాంత్, విద్యుత్ సిబ్బంది, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

గజగజలాడుతున్న ఏజెన్సీ

ములుగు జిల్లాలో తీవ్రమైన చలి

8వ పేజీలో..



మళ్లీ పొలిటికల్ హీట్

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం నిర్ణయంపై ఉత్కంఠ

- పార్టీ ఫిరాయింపులు, స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు అసంతృప్తి
- నాలుగు వారాల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు
- స్పీకర్ నోటీసులపై వివరణ ఇవ్వని కడియం
- రాజకీయాల్లో తన ఇమేజ్‌ని కాపాడుకోవాలని తాపత్రయం
- అధిష్ఠానం ఆదేశిస్తే రాజీనామా యోచనలో శ్రీహరి..?
- ఇదే జరిగితే ఆరు నెలల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లు రాజకీయాల్లో మరో ఉత్కంఠ మొదలైంది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక అనివార్యం అనే చర్చ జరుగుతోంది. గత పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తెతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఆయన పార్టీ ఫిరాయింపుపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. దీనికి సంబంధించి ఎమ్మెల్యే కడియంకు స్పీకర్ నోటీసులు ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు వివరణ ఇవ్వలేదు. రాజకీయాల్లో తన క్లీన్ ఇమేజ్‌ను కాపాడుకునేందుకు కడియం రాజీనామా చేస్తారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించటంతో అధిష్ఠానం అదే ఊపుతో ఉప ఎన్నికలకు మొగ్గు చూపుతోందని భావిస్తున్నారు.

రాజీనామా యోచనలో కడియం..?

రాజకీయాల్లో క్లీన్ ఇమేజ్ ఉన్న కడియం శ్రీహరి... తనపై వస్తున్న ఫిరాయింపుల ఆరోపణలకు చెక్ పెట్టాలనే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. రాజకీయాల్లో అవినీతి మరకలు, పైరవీల తాకిడి లేని నేతగా కడియంకు పేరుంది. మూడు దశాబ్దాలకు పైగా తనకున్న క్లీన్ ఇమేజ్‌ని కాపాడుకోవాలనే ఆలోచనలో శ్రీహరి ఉన్నారనే టాక్ వినబడుతుంది. దీంతో ఇప్పటికే ముందుచూపుతో వేల కోట్ల రూపాయలతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారు. దేవాదుల నీటిని కూడా తన నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తీసుకెళ్లేలా ప్రణాళికబద్ధంగా ముందుకు వెళుతున్నారు. ఈ క్రమంలోనే స్పీకర్ ఇచ్చిన నోటీసులకు కడియం సమాధానం ఇవ్వకుండా దాటవేస్తున్నారనే చర్చ జరుగుతోంది. సెప్టెంబరు చివరి నాటికే కడియం స్పీకర్ నోటీసులకు సమాధానం ఇస్తారనే భావించారు. అయితే స్పీకర్ నోటీసులకు సమాధానం ఇవ్వకపోవటం వెనుక రాజీనామా యోచన ఉందనే అంటున్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఆదేశిస్తే రాజీనామా చేసి, ఉప ఎన్నికలను ఎదుర్కొనేందుకు తాను సిద్ధమేనని కడియం సంకేతాలు ఇస్తున్నట్లుగా తెలిసింది. ఇంకా మూడేళ్ల పదవీకాలం ఉండటంతో పార్టీ ఫిరాయించాననే అపవాదుతో కొనసాగటం కంటే.. ఉపఎన్నిక ఎదుర్కోవటమే మేలని కడియం భావిస్తున్నారని తెలుస్తోంది. ఇదే జరిగితే స్పీకర్ నోటీసులకు (మిగతా 7వ పేజీలో)

నాలుగు వారాల గడువు

పార్టీ ఫిరాయింపుల వ్యవహారం రాజకీయాల్లో హీట్ పుట్టిస్తోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచి పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని ఆ పార్టీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. పది మందిలో ఉమ్మడి జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా ఉన్నారు.

ఈ క్రమంలో ఫిరాయింపులపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు గత జూలై 31న స్పీకర్‌ను ఆదేశించింది.దీంతో పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న కడియం శ్రీహరితో పాటు పది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికే చాలా మంది ఎమ్మెల్యేలను స్పీకర్ వ్యక్తిగతంగా విచారణ జరిపారు. అయితే స్టేషన్‌ఘన్‌పూర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లు మాత్రం ఇప్పటి వరకు స్పీకర్ ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇవ్వలేదు. పార్టీ ఫిరాయింపులపై రోజువారీగా విచారణ జరిపి నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. దీంతో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడుతుందా అనేది ఉత్కంఠగా మారింది.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ రాహుల్ శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధలు పాటించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. ఐడీవోసీ కార్యాలయంలో జిల్లాలోని ఆస్పత్రుల యజమానులతో సమావేశమయ్యారు. వైద్య సేవల్లో నైతిక విలువలు, రోగుల భద్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని (మిగతా 8వ పేజీలో)

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

కృష్ణకాలనీ, నవంబర్ 17(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కిరణ్ ఖరే సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు, ఐపీవో ఆఫర్ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. మోసగాళ్లు ప్రముఖ కంపెనీల పేరుతో నమ్మదగినట్లు కనిపించే విధంగా నకిలీ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు రూపొందించడం, వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఈ-మెయిల్ వంటి వేదికల ద్వారా ఆకర్షణీయమైన లింకులు పంపడం చేస్తున్నారని తెలిపారు. ఐపీవోలో పెట్టుబడి పెట్టే ముందు సెబీ, ఎన్ఎస్ఈ, బీఎస్ఈ అధికారక వెబ్‌సైట్లు తప్పనిసరిగా తనిఖీ చేయాలని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ధర్మరావుపేటలో ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గణపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని ధర్మరావుపేట, గణపురం, బుద్దారం, కొత్తపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేందర్, చోటేమియా, కట్కూరి శ్రీనివాస్, శివశంకర్ రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీలో బాలిక మిస్సింగ్

వాజేడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ వసతిగృహం నుంచి బాలిక తప్పించుకున్న సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని ఏడ్జర్లపల్లికి చెందిన బాలిక కేజీబీవీలో పదో తరగతి చదువుతోంది. కొంత కాలంగా ఆమె కేజీబీవీకి రాకుండా ఇంటి వద్దనే ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం తల్లిదండ్రులు కేజీబీవీలో వదిలి వెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం కేజీబీవీ ప్రహరీ దూకి పారిపోయింది. బాలిక బంధువులు వాజేడులో ఉండటంతో కేజీబీవీ సిబ్బంది అక్కడ వెతికారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులకు వాజేడుకు చేరుకొని చుట్టుపక్కల వెతకగా ఆచూకీ లభించలేదు. బాలిక పారిపోయిన విషయాన్ని బయటకు పొక్కకుండా కేజీబీవీ సిబ్బంది గోప్యంగా ఉంచారు. సాయంత్రం విషయం బయటకు తెలిసింది. దీనిపై కేజీబీవీ జీసీడీవో రజితను వివరణ కోరగా సిబ్బంది నిర్లక్ష్యం లేదని, బాలిక డ్రాపౌట్‌గా ఉండటంతో తమ సిబ్బంది ఇంటికి వెళ్లి పదోతరగతి వరకు చదువుకోమని నచ్చజెప్పారని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కేజీబీవీకి తీసుకురాగా బాలిక గోడ దూకి పారిపోయిందని, ఇలా జరుగుతుందని తాము అనుకోలేదని అన్నారు. బాలిక ఆచూకీ కోసం ఎస్‌వోను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని చెప్పినట్లు జీసీడీవో తెలిపారు. కాగా, ఈ సంఘటనపై సిబ్బంది నిర్లక్ష్యం కూడా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన

మొగుళ్లపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్కిశాల మోడల్‌స్కూల్ విద్యార్థులకు జిల్లా సాంస్కృతిక సారథి మైసయ్య కళా బృందం ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రఘుపతి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, 18ఏళ్లలోపు బాలికకు వివాహం చేస్తే శిక్షార్హులవుతారని అన్నారు. బాలికలు విద్యనభ్యసించడం ద్వారానే మెరుగైన భవిష్యత్తును పొందగలరని, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావచ్చని అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే శారీరక, మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. చిన్న వయసులో గర్భం దాల్చడం, తల్లీబిడ్డ ఆరోగ్యానికి ప్రమాదకరమని అన్నారు. ఎవరికైనా బాల్య వివాహం గురించి తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం కళాకారులు 'బేటీ బచావో..బేటీ పడావో' కార్యక్రమ లక్ష్యాలు, బాలికల విద్య, ప్రాధాన్యతపై ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు.

పౌష్టికాహార లోపాన్ని నిర్మూలిస్తాం

- చిన్నారుల ఆరోగ్యమే ప్రధానం
- అంగన్‌వాడీల బలోపేతానికి కృషి
- స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క
- ములుగులో పైలట్ ప్రాజెక్టుగా పాల పంపిణీ



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా ములుగు జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీ ప్రీ స్కూల్ చిన్నారులకు రోజూ 100 మిల్లీ లీటర్ల పాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని పౌష్టికాహార లోప రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 3-6 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లలకు ప్రతి రోజూ పాలను అందజేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో పేదరికంలో ఉన్న పిల్లలు అధిక సంఖ్యలో ఉండటంతో ఈ కార్యక్రమానికి ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులను టీచర్లు సొంత పిల్లల్లా చూసుకోవాలని సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చడానికి కృషి చేస్తామని అన్నారు. కలెక్టర్ దివాకర మాట్లాడుతూ ఈ నూతన కారయక్రమాన్ని ములుగు జిల్లా నుంచి ప్రారంభించడం సంతోషకరమన్నారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై రూపొందించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్‌రెడ్డి, డీడబ్ల్యూవో తుల రవి, సీడీపీవో శిరీష, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బ్యాంకు బ్రాంచిని ప్రారంభించిన మంత్రి

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇండియన్ బ్యాంకు బ్రాంచిని మంత్రి ధనసరి సీతక్క ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కల్యాణి, ఇండియన్ బ్యాంకు హైదరాబాద్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రణేశ్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కేశవరావు, కరీంనగర్ జోనల్ మేనేజర్ సుధాకర్ రావు, ములుగు బ్రాంచి మేనేజర్ బి. శ్యాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

20 కిలో మీటర్లు నడిచి.. గుట్టలు దిగి..

గిరిజన యువడిని వైద్యానికి తీసు కొచ్చిన గ్రామస్థులు

వెంకటాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలానికి సుమారు 20 కిలో మీటర్ల దూరంలో గుట్టలపై ఉన్న పాములూరు గిరిజనుల గోస అంతా ఇంతా కాదు. ఏ అవసరం ఉన్నా కాలినడకన సుదూర ప్రయాణం చేయాల్సిందే. ఎంతో ప్రయాస పడి గుట్టలు దిగి రావాల్సిందే. ఈ గ్రామంలో 10 కుటుంబాలు నివసిస్తున్నాయి. సోమవారం మడివి అడమ అనే యువకుడికి తీవ్ర జ్వరం వచ్చింది. దీంతో గ్రామస్థులు డోలికట్టి 20 కిలో మీటర్లు నడుస్తూ మండల కేంద్రం వెంకటాపురానికి వైద్యం కోసం తీసుకొచ్చారు. ఈ దృశ్యం పలువురిని కలచివేసింది. గుట్టలపై ఉన్న తమకు వైద్యసహాయం అందక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



డోలిలో యువకుడిని మోసుకొస్తున్న పాములూరు గిరిజనులు



పాల్గొన్న భక్తులు

నందీశ్వరుడికి మహాభిషేకం



అభిషేకం తర్వాత నందీశ్వరుడు

మహదేవ్‌పూర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం రాత్రి భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసం బహుళ త్రయోదశి సందర్భంగా తూర్పు ద్వారం నందీశ్వరుడికి వేద మంత్రోచ్చరణల మధ్య అర్చకులు, వేద పండితులు పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. కార్తీక మాసంలో నందీశ్వరుడికి అభిషేయడం ఎంతో విశేషమని తెలిపారు. ఈఅభిషేకాన్ని రెండు గంటలపాటు నిర్వహించారు. లోక కల్యాణార్థం నిర్వహించిన ఈ కార్యక్రమంతో తమలోని తెలియని దోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. నందీశ్వరుడి, పరమేశ్వరుడి ప్రవచనాలను బాచంపల్లి సంతోష్ కుమార శాస్త్రీ వినిపించగా భక్తులు ఎంతో శ్రద్ధగా ఆలకించారు. ఈ కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- పోక్సో కేసులో బెయిల్‌పై వచ్చిన సంజయ్
- గ్రామంలో తిరగలేక మనోవేదన
- జనగామ జిల్లా నర్సాపూర్‌లో ఘటన



సంజయ్ (ఫైల్)

6లో

మెడికల్ షాపుల ఆకస్మిక తనిఖీలు

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మితే కఠిన చర్యలు: పావని

భూపాలపల్లిటౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని పలు మెడికల్ షాపులను ఔషధ నియంత్రణ జిల్లా అధికారి పావని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలన ఆదేశానుసారం తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. గర్భస్రావానికి సంబంధించిన, మత్తు అలవాటు కలిగించే మందులను, యాంటీబయోటిక్స్‌ను తనిఖీలు చేశారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి కొనుగోలు దారుడికీ బిల్ తప్పకుండా ఉండాలన్నారు.



భూపాలపల్లిలోని మెడికల్‌షాపులో తనిఖీలు చేస్తున్న ఔషధ నియంత్రణ అధికారి

ముగిసిన జీడికల్ బ్రహ్మోత్సవాలు


అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

లింగాలఘణపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ జీడికల్ వీరాచల శ్రీరామ చంద్రస్వామి కార్తీకమాస బ్రహ్మోత్సవాలు సోమ వారంతో ముగిశాయి. 15రోజుల పాటుగా వైభవంగా సాగిన వేడుక లకు వేలాదిమంది భక్తులు మొక్కు లను చెల్లించుకున్నారు. చివరి ఘట్టంగా సోమవారం నిర్వహించిన అష్టోత్తర శతఘటాభిషేకం ఆలయ పాలకమండలి సభ్యులు ప్రత్యేకంగా నిర్వహించారు. అనంతరం పండితోపన్యాసం, మహాదాశీర్వచనం కార్యక్రమాలు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏలె మూర్తి, ఈవో చిందం వంశీ, రిటైర్డు ఈవో కేకే రాములు, వేదపండితులు శ్రీనివాసాచా ర్యులు, బీట్యాకారు విజయసారధి, భార్గవాచార్యులు, మురళీధరాచార్యులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- పోక్సో కేసులో 20 రోజుల క్రితం బెయిల్‌పై విడుదల


సంజయ్ (ఫైల్)

తరిగొప్పుల, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జనగామ జిల్లా తరిగొప్పుల మండలం నర్సాపూర్ సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బంధువుల కథనం ప్రకారం. నర్సాపూర్‌కు చెందిన పల్లె సంజయ్ గౌడ్(19) చిన్నతనం లోనే తండ్రి చనిపోగా, ఇటీవల 4 నెలల కిందట అనారోగ్యంలో తల్లి మహాలక్ష్మి మృతి చెందింది. జీవనోపాధి కోసం సంజయ్ గ్రామంలో కులవృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాడు. తరిగొప్పుల మండలానికి చెందిన ఓ బాలికతో సంజయ్ అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంజయ్‌పై పోక్సో కేసు నమోదై 29 రోజులు జైలుకు వెళ్లాడు.

20 రోజుల కిందట బెయిల్‌పై బయటకు వచ్చాడు. జైలునుంచి వచ్చినప్పటి నుంచి గ్రామంలో తలెత్తుకుని తిరగలేక పోతుండడంతో తీవ్ర మనస్తాపానికి గురై, ఆదివారం పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

హోటల్‌పై దాడి.. ఐదుగురిపై కేసు నమోదు

బచ్చన్నపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బచ్చన్నపేట మండలం పోచన్నపేటలో కొత్తగా ప్రారంభించిన హోటల్‌పై, ప్రస్తుతం నడుస్తున్న రాజస్థాన్ హోటల్ యజమాని, అందులో పనిచేస్తున్న వారు దాడి చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్‌కే హమీద్ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం. గ్రామానికి చెందిన రాణి అనే మహిళ కొంతకాలంగా హోటల్ నడిపి, ప్రస్తుతం చంపారామ్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చింది. అప్పటికే గ్రామంలో రాజస్థాన్, బాలాజీ స్వీట్ హౌస్ పేరుతో నడుస్తున్న హోటల్ యజమాని గిరాకీ తగ్గుతుందనే కోపంతో పలువురితో కలిసి కొత్తగా ప్రారంభించిన హోటల్‌పై దాడి చేశారు. ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు రాంగుజార్ దులాడితో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వివరించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దు

మరిపెడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల సంక్షేమ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని మరిపెడ మండల స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం రాత్రి మరిపెడ బంగ్లాలోని మహాత్మా జ్యోతిబా ఫూలే బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటలు, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, స్టడీ రూమ్, తరగతి గదులు, డార్మెంటరీ గదులను పరిశీలించారు. స్కూల్ స్టాఫ్, సిబ్బందితో మాట్లాడారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని సూచించారు. చలి తీవ్రత దృష్ట్యా విద్యార్థులు బెడ్ షీట్స్ సమకూర్చాలన్నారు. నిత్యం ఆరోగ్య పరిస్థితులను గమనించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విధుల పట్ల అశ్రద్ధ వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు.

వ్యవసాయ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


సాగు న్యాయ యాత్ర శిబిరంలో మాట్లాడుతున్న భూమి సునీల్

పెద్దవంగర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ చట్టాలపై రైతులకు కనీస అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే భూ సమస్యలను అధిగమించవచ్చని రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు, లీఫ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు భూమి సునీల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో లీఫ్స్ (లీగల్ ఎన్‌పవర్ మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాగు న్యాయ యాత్ర భాగంగా రైతులకు భూమి హక్కులు, భూ చట్టాలపై అవగాహనతోపాటు న్యాయపరమైన సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ చట్టాలను రైతులకు చుట్టాలను చేయడమే లక్ష్యంగా ఈయాత్ర కొనసాగుతుందన్నారు.

రైతులు అప్రమత్తంగా లేకుంటే రాబోయే రోజుల్లో ఇబ్బందులు ఎదురువుతాయన్నారు. ప్రతి రైతు చట్టాలు తెలుసుకోవాలని సూచించారు. దీంతో రైతులకు పంటల విక్రయం, విత్తన కొనుగోలు సులభమవుతుందన్నారు. విత్తనం నుంచి మార్కెటింగ్ వరకు వ్యవసాయ రంగంలో 154 చట్టాలున్నా యని, వాటన్నింటిపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో కొత్త విత్తన చట్టం, ప్రతి రైతుకు భూభారతిలో భూఆధార్‌లో నంబర్ వస్తుందన్నారు. కీలకమైన భూ సమస్యలు, విత్తనం, సాగునీటి సమస్యలు, పంటరుణాలు, మార్కెట్ సమస్యలపై రూపొందించిన చట్టాలపై రైతులకు వివరించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రకియా సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఏవో గుగుతోతు స్వామినాయక్, లీఫ్స్ సంస్థ సలహాదారుడు కరుణాకర్ దేశాయ్, ఏఈవోలు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, ప్రవీణ్‌రావు, శ్యామ్, రవీందర్‌రెడ్డి, మల్లికార్జునచారి, లింగమూర్తి, వెంకన్న, లీఫ్స్ బృందం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మైనార్టీ గురుకుల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వనజ

తొర్రూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మైనార్టీ గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వనజ తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఎంపికైన విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులో నిర్వహించిన జిల్లా స్థాయి నెట్ బాల్ పోటీలు, వరంగల్‌లో జరిగిన హాకీ పోటీల్లో గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, ఎంపికైన వారిలో దీక్ష, సుష్మిత, నందిని, ఎమ్డీ.షరీన్, రుషిత, ఎస్‌కే. జోహార, షాహిన్, మునీర్, శృతిలు ఉన్నారని అన్నారు. వారికి అభినందనలు తెలిపారు. క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగ ఉన్నత అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పీఈటీ కల్యాణి, ఉమ, విద్యార్థులు ఉన్నారు.

గ్రామాల్లోనే సమస్యలను పరిష్కరించాలి

మరిపెడ రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీడీవో వేణుగోపాల్ అన్నారు. సోమవారం మండలంలోని పురుషోత్తమాయగూడెం రైతు వేదికలో 14 గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ల, మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలోని ఎఫ్ఏలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.గ్రామాల్లోనే తాగునీరు, వీధి దీపాలు, మురికి కాలువలు శుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. అదే విధంగా నర్సరీస్, లేబర్ మొబలైజేషన్ గురించి వివరించారు. సమావేశంలో ఎంపీవో సోమ్లాల్, అధికారులు పాల్గొన్నారు.

జయ్యారం హైస్కూల్‌లో మోడల్ ఎలక్షన్స్

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జయ్యారం హై స్కూల్‌లో ఆ స్కూల్ నిర్వాహకులు విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కోసం మోడల్ ఎలక్షన్స్‌ను సోమవారం నిర్వహించారు. స్కూల్ కౌన్సిల్ కమిటీ ఎన్నికను అచ్చం స్థానిక సంస్థల ఎన్నికలవలే జరిపారు. నామినేషన్స్, ఉపసంహరణలు, పోటీలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు, ప్రచారం, పోలింగ్ కేంద్రాలు, ప్రిసైడింగ్ ఆఫీసర్స్, ఎలక్షన్ ఆఫీసర్స్, ఓటు వేసే విధానం, కౌంటింగ్ పక్రియను జరిపి విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమాన్ని ఆ పాఠశాల హెచ్‌ఎం ఎం.ఉషశ్రీ, సోషల్ టీచర్ స్వామినాథ్, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

రామలింగేశ్వరస్వామికి రెడ్యా పూజలు

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉగ్గంపల్లిలోని రామలింగేశ్వరస్వామికి మాజీ మంత్రి రెడ్యానాయక్-లక్ష్మి దంపతులు పవిత్ర కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ ఆలయ అర్చకులు దేవతామూర్తులకు అర్చనలు, అభిషేకాలు జరిపి రెడ్యా దంపతులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. వీరి వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఎండీ.అయూబ్ తదితరులు ఉన్నారు.

ఆర్టీఏ అధికారుల విస్తృత తనిఖీలు

తొర్రూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారు ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై సోమవారం ఆర్టీఏ అధికారులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమతి పత్రాలులేని వాహనాలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ అధికారి వెంకట్‌రెడ్డి, ఆర్టీఏ అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

మరిపెడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు సమరశీల పోరాటలతో ఎండగట్టాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, మరిపెడ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం మరిపెడ మండల సీపీఐ కౌన్సిల్ సమావేశం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జరుగగా పాల్గొని మాట్లాడారు. ప్రజాపోరాటాలతోనే ప్రజల డిమాండ్లు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి మారగాని భాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్, రమేశ్, సోమన్న పాల్గొన్నారు.


శఠగోపం బహూకరిస్తున్న దాతలు వెంకటేశ్వర్లు-విజయ దంపతులు

వెండి శఠగోపం బహుకరణ

నర్సింహులపేట (మహబూబాబాద్ క్రైం), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రాజరాజేశ్వర ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి ఓ భక్తుడు వెండి శఠగోపం బహూకరించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు దేవేంద్ర శర్మ సోమవారం తెలిపారు. మండలంలోని కౌసల్యదేవిపల్లి గ్రామానికి చెందిన తాండూరి వెంకటేశ్వర్లు-విజయ దంపతులు రాజరాజేశ్వర ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి రూ.20వేల విలువగల వెండి శఠగోపం ఉచితంగా అందజేశారు. అనంతరం కుటుంబ సమేతంగా రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం మాజీ చైర్మన్ మంచినీళ్ల లక్ష్మీనారాయణరెడ్డి, రమేశ్, రవి, వెంకన్న, కనకం, భక్తులు ఉన్నారు.

సీఐటీయూ మండల కార్యదర్శిగా వీరన్న


వీరన్న

మరిపెడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మరిపెడ మండల కార్యదర్శిగా ఎల్లంపేట గ్రామానికి చెందిన దుండి వీరన్న ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా బాధ్యులు కుంట ఉపేందర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా కొండ ఉప్పలయ్య, బెస్త సంపూర్ణ, కుమ్మరికుంట్ల జ్యోతి, లీలాబాయి, కవిత, ఉపేంద్ర, మల్లాసర్, జామ్మూర్తి, సైదులు, యాదగిరి, ముత్తయ్య వెంకన్న, భిక్షం, ఆకుల వేణు తదితరులు ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా దుండి వీరన్న మాట్లాడుతూ తన ఎన్నికకు సహక రించిన సీఐటీయూ పెద్దలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 28, 29న మరిపెడలో జరిగే సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలి

తొర్రూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి అన్నారు. సోమవారం ఎఫ్ఎమ్ఎమ్ సాంఘీక సంస్థ, శ్రీవాణి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో తొర్రూరుతో పాటు మండలంలోని మరికొన్ని గ్రామాల్లో నిరుపేద మహిళలకు ఉచిత మగ్గం శిక్షణను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు చదువు, ఉద్యోగమే కాకుండా ఉపాధి కోసం నైపుణ్య శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటి ద్వారా మహిళలు సాధికారత సాధించవచ్చన్నారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, మహిళలు ఇలాంటి శిక్షణతో పాటు అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కరుణ, శ్రీకాంత్, అజయ్‌కుమార్, ప్రమీల, శిరీష, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

మరిపెడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మరిపెడ, చిన్న గూడూరు మండలాలకు చెందిన రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకొని గిట్టుబాటు ధరను పొందా లని డీసీసీబీ డైరెక్టర్, మరిపెడ పీఏసీఎస్ చైర్మన్ చాపల యాదగిరిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మరిపెడ పీఏసీఎస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ సహకారంతో మరిపెడ పీఏసీఎస్ ఆధ్వర్యాన అబ్బాయిపాలెం,ఆనేపురం, బీచ్‌రాజ్‌పల్లి, బుర్హాన్‌పురం, బాల్నిధర్మారం, చిల్లంచర్ల, గిరిపురం, మరిపెడ, నీలికుర్తి, పీఎస్ గూడెం, తానంచర్ల, ఎల్లంపేట, చిన్నగూడూరు, విస్సంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవొద్దని సూచించారు. సీఈవో నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వనదేవతల చుట్టూ పునాది పనులు


సమ్మక్క- సారలమ్మల గద్దెల వద్ద చేపడుతున్న పునాది పనులు

తాడ్వాయి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క -సారలమ్మల దేవస్థానం శాశ్వత అభివృద్ధి పనుల్లో భాగంగా సోమవారం తల్లుల గద్దెల చుట్టూ ఉన్న క్యూలైన్ గ్రిల్స్ తొలగించి పునాది పనులు అధికారులు ప్రారంభించారు. దీనికి ముందు ఆదివారం రాత్రి పూజారులు అమ్మవార్లకు ప్రత్యేక రహస్య పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. అయితే దేవస్థానం మొత్తం రాతి నిర్మాణాలు చేపట్టగా అందులో భాగంగా గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల పునర్ ప్రతిష్ఠాపన పనులు కొనసాగుతుండగా సమ్మక్క-సారలమ్మల గద్దెల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ క్రమంలో గద్దెల మూల స్తంభాలు కదిలించకుండా చుట్టూ బేస్‌మెంట్ పనులు ప్రారంభమయ్యాయి. పునాదులు పూర్తి కాగానే రాతి నిర్మాణాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. భక్తులకు తల్లుల దర్శనాల కోసం గద్దె గేట్ వద్ద దారి ఉంచారు. యధావిధిగానే భక్తులు దేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

అక్రమ పట్టాను రద్దు చేయాలని సీపీఎం ధర్నా


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, పేదలు

గోవిందరావుపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా గోవిందరావుపే మండలంలోని పస్రాలో పుల్యాల వసంత పేరుపై ఉన్న అక్రమ పట్టాను రద్దుచేసి పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు, పేదలు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పొదిళ్ల చిట్టిబాబులు మాట్లాడుతూ పస్రా సుందరయ్యనగర్ పరిధిలోని సర్వేనంబర్ 109లో గల ప్రభుత్వభూమిలో ఐదేళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని అన్నారు. అయితే పుల్యాల కృష్ణారెడ్డి అనే న్యాయవాది తన భార్య పుల్యాల వసంత పేరుతో 40ఎకరాలను అక్రమంగా పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. ఈభూమిపై వారికి ఎలాంటి హక్కులేదని, ఎక్కడా సాగు చేయడంలేదని అధికారులు స్పష్టంగా పేర్కొన్నారని గుర్తు చేశారు. చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ భూమిని అక్రమంగా సొంతం చేసుకున్న కృష్ణారెడ్డిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఈవిషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని అక్రమ పట్టాను రద్దుచేసి పేదలకు న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా పేదలు నిర్మించుకున్న గుడిసెలకు పట్టాలు జారీ చేయాలని, వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి కాలనీ నిర్మాణం చేపట్టాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గొంది రాజేష్, అంబాల మురళి, కడారి నాగరాజు, గుండు రామస్వామి, లెనిన్,కాప కోటేశ్వర్‌రావు, బుర్ర శ్రీనివాస్, పేదలు సువర్ణ, అశోక్ కోయిల సులోచన, దేవరాజు, గట్టు రామకృష్ణ, మనోజ్, బ్రహ్మచారి, తదితరులు పాల్గొన్నారు.

రామప్ప క్షేత్రానికి కార్తీకశోభ

భారీగా తరలివచ్చిన భక్తజనం


దేవాలయంలో భజన చేస్తున్న భక్తులు

వెంకటాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శంభో శంకర హరహర మహాదేవ.. భక్తుల నామస్మరణలతో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయం మార్మోగింది. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో రామప్ప దేవాలయానికి చేరుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి వేదపండితులు అర్చనలు, అభిషేకాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించి బిల్వార్చన పూజలు జరిపారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తులు వివిధ అలంకరణలో దీపంతులతో కార్తీకదీపం వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో రామప్పలో భక్తుల సందడితో కార్తీక శోభ సంతరించుకుంది.

డిసెంబరు 17న ప్రాంతీయ డాక్ అదాలత్

గిర్మాజీపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భారతీయ తపాలా శాఖ 52వ ప్రాంతీయ డాక్ అదాలత్ డిసెంబరు 17న ఉదయం 10.30 గంటలకు గూగూల్ మీట్ వీడియో కాన్ఫరెన్స్‌తో జరుగుతుందని వరంగల్ డివిజన్ పోస్టల్ సూపరిండెంట్ బి. రవికుమార్ సోమవారం తెలిపారు. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాల పరిధిలోని ప్రజలు పోస్టల్ సేవలపై తమ ఫిర్యాదులను కె.శ్రీకాంత్, అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్), పోస్ట్ మాస్టర్ జనరల్ కార్యాలయం, హైదరాబాద్ రీజియన్, హైదరాబాద్ - 500001 చిరునామాకు డిసెంబరు 1 లోగా పంపించాలని ఆయన కోరారు.

ఐటీడీఏలో గిరిజన దర్బార్

ఏటూరునాగారం రూరల్, నవంబరు17(ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా ఏటూరునాగరంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ జరిగింది. గిరిజనులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్‌వో రాజ్‌కుమార్‌కు వినతులు సమర్పించారు. గిరిజన దర్బార్‌లో మొత్తం 8 మంది గిరిజనులు వినతులు అందజేశారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్, ములుగు జిల్లా వాజేడు, ఏటూరునాగారం, గోవిందరావుపేట, ములుగు తదితర మండలాల నుంచి గిరిజనులు తరలివచ్చారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, భూమిని గిరిజనేతరుల బారి నుంచి రక్షించాలని తదితర సమస్యలను ఏవోకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల ధర్నా

బాలసముద్రం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈపీఎఫ్ పెన్షనర్లకు మినిమం పెన్షన్ నెలకు రూ. వెయ్యి మాత్రమే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి తూపురాణి సీతారాం ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల కన్వీనర్ ఉప్పు సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన పెన్షన్ విద్రోహదినం ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్‌స్కిల్డ్ లేబర్ రోజుకు రూ. వెయ్యి సంపాదిస్తుంటే 35 ఏళ్ల సేవ చేసిన స్కిల్డ్ లేబర్‌కు రిటైర్ అయిన తర్వాత రూ. వెయ్యి పెన్షన్ చెల్లించడం సరికాదన్నారు. ఉప్పు సమ్మయ్య మాట్లాడుతూ.. ఈపీఎఫ్ పెన్షనర్ల ఆదాయం ఏడాదికి రూ. 12 వేలు మాత్రమే ఉన్నప్పటికీ తెల్ల రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు, ఆరోగ్యశ్రీ వైద్య సౌకర్యం ప్రభుత్వం వర్తింప చేయడం లేదని అన్నారు. అనంతరం ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నాలో పెన్షనర్ల రాష్ట్ర అర్గనైజింగ్ కార్యదర్శి పెండ్యాల బ్రహ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న, సిరంగి నారాయణ పాల్గొన్నారు.

జంక్షన్లు జామ్..


కాశిబుగ్గ కూడలిలో వాహనాల రద్దీ

- 15 ఏళ్లుగా విస్తరణకు నోచుకోని కూడళ్లు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు
- రోడ్డు పైనే వాహనాల పార్కింగ్
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వరంగల్ సిటీ, నవంబరు17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో.. వరంగల్‌లో ముఖ్యమైన జంక్షన్లు 15 ఏళ్లుగా విస్తరణకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 2010 లోనే వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పోచమ్మమైదాన్, కాశిబుగ్గ, వెంకట్రామ జంక్షన్ల నుంచి నర్సంపేట వెళ్లే రోడ్డును విస్తరించేందుకు మార్కింగ్ పెట్టినా ఇప్పటి వరకు విస్తరించలేదు. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మార్కింగ్ చేసిన ఇళ్ల యజమానులు పెద్ద ఎత్తున పైరవీలు చేయడంతో అధికారులు మార్కింగ్ చేసిన వరకు కూల్చివేసేందుకు జంకుతున్నారు. దీంతో రోజురోజుకు వాహనాల సంఖ్య పెరుగుతుండడంతో ఆ జంక్షన్లు మరింత ఇరుకుగా మారాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క మున్సిపల్, కుడా అధికారులకు హనుమకొండ మీద ఉన్న శ్రద్ధ వరంగల్ తూర్పు మీద ఉండదని, అభివృద్ధి విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తారనే అపవాదును మూటగట్టుకుంటున్నారు. ఇప్పటికైనా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మేయర్, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ దృష్టి సారించి జంక్షన్లను విస్తరించి, అభివృద్ధి చేసి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు, నగర ప్రజలు కోరుతున్నారు.

ఇరుకుగా ఉన్న జంక్షన్లు

2010 సంవత్సరంలోనే కాశిబుగ్గ, పోచమ్మమైదాన్ జంక్షన్లను విస్తరించేందుకు మార్కింగ్ చేశారు. అలాగే నర్సంపేట రోడ్డును విస్తరించేందుకు మార్కింగ్ చేయడంతో విస్తరణలో ఇళ్లను కోల్పోయే ఇంటి యజమానులు వెంటనే ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకుని జంక్షన్లను విస్తరించకుండా అడ్డుకుంటూ వస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారినా జంక్షన్లను విస్తరించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. కాశిబుగ్గ జంక్షన్‌లో ఒక పది టైర్ల లారీ తిరిగే అవకాశం లేకుండా ఇరుకుగా మారిపోయింది. కాశిబుగ్గ జంక్షన్ నుంచి మార్కెట్‌కు వెళ్లే వైపు విస్తరణ చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. పోచమ్మమైదాన్ జంక్షన్ నుంచి దేశాయిపేటకు వెళ్లే వైపు ఉన్న ఇళ్లను తొలగించి విస్తరించాల్సిన అవసరముందని ప్రయాణికులు కోరుతున్నారు. వెంకట్రామ జంక్షన్ నుంచి నర్సంపేట రోడ్డులో రాంకీ ఎంక్లేవ్ వరకు విస్తరించకపోవడంతో రోడ్డు ఇరుకుగా మారి నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన ఘటనలు కూడా ఉన్నాయి.

రోడ్ల పైనే వాహనాల పార్కింగ్

కాశిబుగ్గ, పోచమ్మమైదాన్ జంక్షన్లు ఇరుకుగా మారి ప్రయాణికులు ఇబ్బందుల కు గురవుతుంటే.. దుకాణాల ముందు రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు మరింత కుచించుకుపోయి ప్రయాణికులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ, ఫొటోలు తీయడంలో ఉన్న శ్రద్ధ దుకాణాల ముందు నడిరోడ్డుపై పెట్టిన వాహనాల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా బార్లు, వైన్ షా పులు, షాపింగ్ కాంప్లెక్స్‌ల ముందు రోడ్లపైనే వాహనాలను పా ర్కింగ్ చేసి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. వారి నుంచి మామూళ్లు ఉంటాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జంక్షన్లను విస్తరించాలి

- జి.యాదగిరి, కాశిబుగ్గ



జంక్షన్లను విస్తరించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఉదయం, సాయంత్రం జంక్షన్లలో బాగా రద్దీగా ఉంటోంది. దీనికి తోడు రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి జంక్షన్లను విస్తరించాలి.


పోచమ్మమైదాన్ జంక్షన్‌లో మూలలు విస్తరించకపోవడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

రోడ్లను విస్తరించాలి

జె.శ్రవణ్, గాంధీనగర్



వెంకట్రామ జంక్షన్ సమీపంలో రోడ్డు ఇరుకుగా మారి నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో చాలా మంది మృత్యువాత పడ్డారు. 30 పీట్లు ఉండాల్సిన రోడ్డు 10 పీట్లు ఉండడంతో పాటు పక్కనే మురుగు కాల్వ ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే రోడ్డును విస్తరించేందుకు చర్యలు చేపట్టాలి.

మేడారంలో పూజిత వృక్షాలు

మొక్కలు నాటే ప్రాంతాల గుర్తింపునకు ప్రణాళికలు

తాడ్వాయి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ కుల దైవాలైన సమ్మక్క, సారలమ్మలకు పూజారులు నిర్వహించే పూజలు గొట్టు గోత్రాలకు వారి సంప్రదాయాలకు సంబంధించిన 10 రకాల జాతుల వృక్షాలను మేడారం పరిసరాల్లో నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా మేడారం వనదేవతలను దర్శించుకోడానికి వచ్చే భక్తులు అడవి ప్రాంతాలు వసతి గృహాలు, విడిది స్థలాల్లో వనదేవతలను ప్రకృతి దేవతలుగా భావించి కనిపించిన చెట్లకు పూజలు చేస్తుంటారు. కాగా జరుగుతున్న అభివృద్ధిలో బాగంగా భక్తులకు అందుబాటులో ఈ వృక్షాలు ఉండేలా ఈ 10 రకాల జాతుల మొక్కలను నాటి విరివిగా పెంచాలనే ఉద్దేశంతో అధికారులు ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులను ఈ 10 రకాల మొక్కలను సేకరించాలని సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. అంతే కాకుండా వేల సంఖ్యలో వందల రకాల ఔషధ మొక్కలను మేడారం పరిసరాలు, రోడ్ల వెంబడి, అతిథి గృహాలు, ప్రభుత్వ కార్యాలయలు, జంపన్నవాగు పరిసరాల్లో పెంచడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. 2026 జనవరి 28 నుంచి 31వరకు జరగబోయే సమ్మక్క-సారలమ్మల మహాజాతరకు సుమారు 3 కోట్ల మందికి పైగా భక్తులు తరలి వస్తారని అధికారుల అంచనా వేస్తున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

చెట్ల వివరాలు..

3వ గట్టు సారలమ్మ దేవత వంశానికి చెందిన గోత్ర వృక్షం ఇప్ప చెట్టు, పూజిత వృక్షం కస్సు చెట్టు.
4వ గట్టు పగిడిద్దరాజు, గోవిందరాజు దేవతల వంశానికి చెందిన గోత్ర వృక్షం మద్ది చెట్టు. పూజిత వృక్షం బూరుగ చెట్టు.
5వ గట్టు సమ్మక్క దేవత వంశానికి చెందిన గోత్ర వృక్షం వెదురు చెట్టు. పూజిత చెట్టు మారేడు చెట్టు.
6వ గట్టు వారికి చెందిన గోత్ర వృక్షం బండారి చెట్టు, పూజిత వృక్షం వేప చెట్టు.
8వ గట్టు పూజారలు సిద్ధబోయిన వంశానికి చెందిన గోత్ర వృక్షం నెమలి నార చెట్టు. పూజిత వృక్షం మర్రి చెట్టు.

చిట్యాలలో యువతి అదృశ్యం


పాక స్వాతి (ఫైల్)

పెద్దవంగర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని చిట్యాల గ్రామంలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్సై చిలువేరు ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... చిట్యాల గ్రామానికి చెందిన పాక యాకయ్య-యాకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారి రెండవ కుమార్తె పాక స్వాతి(20) ఇంటర్మీడియట్ పూర్తిచేసింది. మూడు సంవత్సరాలుగా ఇంటి వద్దే ఉంటోంది. అదివారం అదే గ్రామానికి చెందిన కొంతం శ్యామల, స్వాతి షాపింగ్ కోసం తొర్రూరు వెళ్లారు. కాగా, తిరిగి ఇద్దరు ఇంటికి వస్తున్న క్రమంలో స్వాతి పని ఉందని అక్కడే ఉండిపోయింది. సాయంత్రానికి ఇంటికి రాలేదు. సమీప బంధువుల, స్నేహితుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. స్వాతి తండ్రి పాక యాకయ్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి పూర్తి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. స్వాతి ఇంటి నుంచి వెళ్లినప్పుడు వైట్ కలర్ లెగ్గిన్, చున్నీ, బ్లూ వైట్ కలర్ టాప్ ధరించి ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమచారం అందించాలని ఎస్సై తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం

ఇబ్బందులు పడుతున్న జనం


మేడారంలో వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ముధూళి

తాడ్వాయి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ అభివృద్ధి పనుల్లో దుమ్ము లేస్తుందని నీళ్ల చల్లించాలని అధికారులను స్థానికులు, భక్తులు కోరుతున్నారు. మహా జాతరకు సమయం దగ్గర పడుతున్న క్రమంలో పనులు ఊపందుకొని జోరుగా జరుగుతున్నాయి. అయితే మట్టి, ఇసుక తరలించే వాహనాలు, భక్తుల వాహనాలతో దుమ్ము అధికంగా లేస్తుందని పలువురు వాపోతున్నారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులు టిప్పర్ల వెనుక వెళ్లలేక పోతున్నామని ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని అంటున్నారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇండ్లలో దుమ్ము వస్తుందని స్థానికులు తెలుపుతున్నారు. మేడారంలో రోడ్ల విస్తరణ అభివృద్ధి పనుల్లో ఆర్ అండ్ బీ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంతంగా అన్నం తినలేని పరిస్థితి మేడారంలో నెలకొందని ఇంటి బయట ఉతికి ఆరేసుకున్న బట్టలు సైతం దుమ్ముగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనులు జరుగుతున్న నేపథ్యంలో రోడ్లపై నీళ్ల చల్లించి దుమ్ము లేవకుండా అధికారులు చర్య లు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే మేడారం గ్రామ పరిసరాల్లో వాహనాలు తిరగకుండా అడ్డు పడతామని హెచ్చరిస్తున్నారు.

రైలు నుంచి జారిపడి బిహార్ వాసి మృతి

డోర్నకల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైలులో నుంచి జారిపడి బిహార్‌కు చెందిన బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం డోర్నకల్-పాపటపల్లి రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. డోర్నకల్ ఆర్‌పీఎఫ్ ఎస్సై నాగరాజు, జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ పఠాన్ అమీర్‌ఖాన్‌లు తెలిపిన వివరాల ప్రకారం... బిహార్ రాష్ట్రం గయాకు చెందిన సుబోద్‌కుమార్ (17) మరో ఇద్దరు బిహార్ వాసులతో కలిసి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలుకు వెళ్తున్నారు. రైలు డోర్నకల్ - పాపటపల్లి స్టేషన్ల మధ్యకు చేరుకునే సమయంలో సుబోద్‌కుమార్ ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఇది గమనించిన స్నేహితులు చైన్ లాగి రైలును నిలుపుదల చేసి స్నేహితుడు జారి పడిన ప్రదేశానికి వెళ్లారు. అప్పటికే సుబోద్‌కుమార్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. విషయాన్ని రైల్వే అధికారులకు తెలియజేయడంతో డోర్నకల్ ఆర్పీఎఫ్ ఎస్సై నాగరాజు, జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ పఠాన్ అమీర్‌ఖాన్, కానిస్టేబుల్ రవిలు ఘటనా స్థలం వద్దకు చేరుకుని శవ పంచనామా నిర్వహించి అన్నం ఫౌండేషన్ సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

(5వ పేజీ తరువాయి)

మళ్లీ పొలిటికల్ హీట్

సమాధానం ఇవ్వకుండానే సుప్రీంకోర్టు గడువులోగా రాజీనామా చేస్తారనే టాక్ వినబడుతోంది. అయితే స్పీకర్ నిర్ణయాన్ని బట్టి కడియం కూడా తన రాజకీయ నిర్ణయాన్ని తీసుకోవచ్చుననే టాక్ కూడా ఉంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించటంతో కాంగ్రెస్ అధిష్టానం కూడా ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న కడియం శ్రీహరి, దానం నాగేందర్‌లతో రాజీనామా చేయించే అవకాశం ఉందని అంటున్నారు.

కుమార్తె కోసం కారు దిగి..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాల్లో బీఆర్ఎస్ కేవలం స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల్లోనే విజయం సాధించింది. ఆ తర్వాత 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కుమార్తె కడియం కావ్యతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తన కుమార్తె కావ్యను వరంగల్ ఎంపీ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దించేందుకు కడియం తొలుత ప్రయత్నాలు చేశారు. మార్చి 14వ తేదీన నాటకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కావ్య పేరును గులాబీ అధిష్టానం ప్రకటించింది. అయితే అనుహ్యంగా కడియం పార్టీలో తమకు సహకరించటం లేదని, లిక్కర్ కేసులో కవిత అరెస్ట్ కావటం హేయనీయమని పేర్కొంటూ తన కుమార్తెతో కలిసి మార్చి 28న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆ తర్వాత ఎన్నికల్లో కావ్యను వరంగల్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి గెలిపించుకుని, తన వారసురాలిని రాజకీయ అరంగేట్రం చేయించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కడియం శ్రీహరి టార్గెట్‌గా ఆయన పార్టీ ఫిరాయింపుపై బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పీకర్‌ను ఆదేశించిన క్రమంలో కడియం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

- హాస్పిటల్ ఎదుట బంధువుల ఆందోళన
- డబ్బులు కట్టలేదని వైద్యం నిరాకరించినట్లు ఆరోపణ

హనుమకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మహిళ మృతిచెందింది. అయితే తాము డబ్బులు కట్టలేదని యాజమాన్యం వైద్యం నిరాకరించి నిండి ప్రాణాన్ని బలి తీసుకున్నారని మృతురాలి బంధువులు ఆరోపించారు. మృతురాలి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం గార్లపల్లి గ్రామానికి చెందిన గబ్బెట కల్పన (45) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో హనుమకొండ బాలసముద్రంలోని ఆస్పత్రిలో చేరింది. వైద్యం కోసం కుటుంబసభ్యులు రూ.40 వేల వరకు చెల్లించారు. కాని చికిత్సకు రూ.2 లక్షలు కావాలని వైద్యులు చెప్పడంతో ఇప్పటికిప్పుడు అంత డబ్బు లేదని, భూమి అమ్మి ఒక రోజులో చెల్లిస్తామని చెప్పారు. దీంతో ఆస్పత్రి యాజమాన్యం ఆమె వెంటిలేటర్ తొలగించి చికిత్స నిలిపివేయడంతో పరిస్థితి విషమించి సోమవారం సాయంత్రం మృతి చెందింది. ఈ ఘటనతో ఆగ్రహించిన బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. రెండు గంటలకు పైగా బైఠాయించారు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న డీఎంహెచ్‌వో అప్పయ్య, సుబేదారి సీఐ రంజిత్‌కుమార్ ఆస్పత్రికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. బంధువులకు నచ్చజెప్పి పంపించారు. కల్పనకు భర్త వెంకన్న, కూతురు, కొడుకు ఉన్నారు.

పత్తి కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

రైతు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న పి.రమేష్

గిర్మాజీపేట(వరంగల్), నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నష్టదాయకంగా ఉన్న నిబంధనలు, విధానాలు వెంటనే ఉపసంహరించుకుని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి క్రయావిక్రయాలు పునఃప్రారంభించకపోతే సీసీఐ, ఏనుమాముల మార్కెట్ కార్యాలయాలను రైతులతో దిగ్బందిస్తామని అఖిల భారత రైతు సమాఖ్య హెచ్చరించింది. సోమవారం వరంగల్ నగరంలోని ఓంకార్ భవన్‌లో అఖిల భారత రైతు సమాఖ్య వరంగల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన అఖిల భారత రైతు సమాఖ్య జిల్లా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడారు.

పత్తి క్రయ విక్రయాలను సీసీఐ, వ్యాపారులు నిలిపివేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆకాల వర్షాల కారణంగా పత్తి దిగుబడి ఎకరాకు 5 క్వింటాళ్ల వరకు మాత్రమే వచ్చిందని అన్నారు. రైతులు పత్తిని అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకువస్తే సీసీఐ నిబంధనల కారణంగా కనీసమద్దతు ధర అమలు కాకపోవడంతో దళారులు తక్కువ ధరతో దోచుకుంటున్నారని ఆరోపించారు. పత్తిని కనీస మద్దతు ధరతో కొనుగోలుచేసి రైతులను ఆదుకోవాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రైతులకు నష్టదాయకమైన పలు నిబంధనలను అమలుచేస్తూ క్రయవిక్రయాలను నిలిపివేసిందని ఆరోపించారు. రైతులకు ఇబ్బందికరంగా ఉన్న నిబంధనలను సీసీఐ తక్షణమే ఉపసంహరించుకుని పత్తి క్రయవిక్రయాలు చేపట్టాలని, అలాగే వ్యాపారులు సైతం క్రయవిక్రయాల బంద్‌ను మానుకోవాలని కోరారు. లేకుంటే రైతులతో సీసీఐ, మార్కెట్ కార్యాలయాల ముట్టడి తప్పదని రమేష్ హెచ్చరించారు.ఈ నెల 19న ఇందిరా పార్కు వద్ద జరిగే రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ధర్నాకు జిల్లా నుంచి ప్రజలు తరలిరాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిల భారత రైతు సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి హంసారెడ్డి, ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు నర్ర ప్రతాప్, మంద రవి, ఎం.సాగర్, ఎం.రామస్వామి, ఎ.నరసయ్య, నగేష్, ఓదెలు, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల సాగు..
లాభాలు బాగు

- రైతులకు రాయితీలు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

ఖానాపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. అందుకోసం రైతులను ప్రోత్సహించేందుకు రాయితీలను అందిస్తున్నది. ఇందులో ప్రధానంగా కూరగాయల నారు, శాశ్వత పందిళ్లు, మల్చింగ్, ప్రథమశ్రేణి ప్రదర్శన క్షేత్రం, ట్రెల్లిసింగ్‌కు(ఊతం) పలు రాయితీ ఇస్తుంది. వరంగల్ జిల్లావ్యాప్తంగా 2,515 ఎకరాల్లో 3,501 మంది రైతులు మాత్రమే కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు.

శాశ్వత పందిళ్లు

బీర, కాకర వంటి తీగజాతి కూరగాయల సాగు కోసం శాశ్వత పందిళ్ల నిర్మాణానికి 50 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుంది.

ఒక యూనిట్‌కు రాయితీ రూ.50,000 వేలు (విస్తీర్ణం అర ఎకరం) ఐదు యూనిట్ల వరకు రైతుకు అవకాశం ఉంటుంది.

ఈ కూరగాయలకు రాయితీ

టమాట, వంగ, పచ్చి మిరప, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ వంటి కూరగాయల నారుపై ప్రభుత్వం రైతులకు 100 శాతం రాయితీ ఇస్తుంది. కావాల్సిన నారు కోసం రైతులు సిద్దిపేట జిల్లాలోని ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సంప్రదిస్తే ఉచితంగా పెంచి ఇస్తారు. అందుకు రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో 30 రోజుల ముందు ఉద్యానవన శాఖాధికారిని కలవాలి.


రైతు సాగు చేస్తున్న బీరకాయ తోట

మల్చింగ్‌తో ఉపయోగాలు

కూరగాయల సాగులో కలుపు సమస్యను అధిగమించడానికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించడానికి మల్చింగ్ ఉపయోగపడుతుంది. ఎకరానికి రూ.8వేల వరకు రాయితీ ఉంటుంది. ఒక రైతు 5 ఎకరాల వరకు రాయితీ పొందవచ్చు.

అంటు మొక్కలకు రాయితీ..

భూమి ద్వారా సంక్రమించే వివిధ తెగుళ్లు, చౌడు నేలలను తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే అంటు మొక్కల (వంగ)కు ప్రభుత్వం ఎకరానికి రూ.30 వేల వరకు రాయితీ ఇస్తుంది. పరిమితి 1 ఎకరం మాత్రమే.

ట్రెల్లిసింగ్ (ఊతం)

ట్రెల్లిసింగ్ విధానంలో టమాట ఇతర కూరగాయల పంటలు సాగు చేయడానికి ఎకరానికి రూ.10వేల రాయితీ సదుపాయం కల్పించబడింది. రాయితీ 1 ఎకరానికి మాత్రమే పరిమితం. దీంతో పాటు బిందు సేద్యానికి ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం, తుంపర్ల సేద్యానికి 75 శాతం రాయితీ ఉంది. వరంగల్ జిల్లా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారులు కోరుతున్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

తరుణ్, ఖానాపురం మండల ఉద్యానవన శాఖాధికారి



రైతులు కూరగాయల సాగుపై ఆసక్తి చూపాలి. ఇక్కడి రైతులు ఉద్యానవన పంటలను చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఎక్కువగా వరి, పత్తి పంటపైనే ప్రధానంగా దృష్టి సారించారు. కూరగాయల సాగు చేస్తే ఉద్యానవన శాఖ నుంచి ఎక్కువ మొత్తంలో రాయితీలు వస్తున్నాయి. రైతులు వాటిని సద్వినియోగం చేసుకుని లాభాలు పొందాలి.

సంక్షోభంలో పత్తి రైతులు

- కిషన్‌రెడ్డి, తుమ్మల రాజీనామా చేయాలి
- మాజీ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్


మీడియాతో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్దిష్టమైన విధానం లేక పత్తి రైతులు సంక్షోభంలో కూరుకున్నారని ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, తాటికొండ రాజయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో రైతులు పంటలను అమ్ముకునే పరిస్థితి లేదని విమర్శించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. పత్తి క్వింటాకు రూ.8100 మద్దతు ధర కల్పించాలని, మార్కెట్‌లో రూ.6వేల నుంచి రూ.7వేల ధర పలకడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అప్పుల బాధతో ఇప్పటికే సుమారు 500మంది పత్తి రైతులు ఆత్మహత్యచేసుకున్నట్లు సర్వేల ద్వారా తెలుస్తోందన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తమ మంత్రి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శిస్తారని వినయ్‌భాస్కర్ తెలిపారు. రైతులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఇక్కడి నుంచే ప్రత్యేక ప్రణాళికతో పోరాటాలకు సిద్ధమవుతారన్నారు.

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. రైతు సమస్యలను గాలికివది లేసి రాజకీయాలు చేస్తున్న మంత్రులను నిలదీయాలని రైతులను కోరారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. వడ్లకు బోనస్ వెంటనే ప్రకటించాలన్నారు. ఆసియాలోనే అతి పెద్ద వ్యవసాయ మార్కెట్‌కు పత్తి తీసుకురావద్దని అధికారులు ఆదేశాలిచ్చారంటే రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు.పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, నాయకులు నయీమొద్దీన్, రమేష్, మహేందర్, వినీల్‌రావు, రవీందర్‌రావు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో గర్భిణి ఆత్మహత్య

ఇల్లందకుంట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన మల్లెబోయిన మౌనిక (20) అనే ఏడు నెలల గర్భిణి అత్తింటి వేధింపులతో ఉరేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన మౌనిక వివాహం జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా గణపూర్ మండలం బుధారం గ్రామానికి చెందిన మల్లెబోయిన ప్రశాంత్‌తో 2024లో జరిగింది. ఆ సమమయంలో అడిగిన కట్నంతోపాటు రెండున్నర తులాల బంగారం, ఎనిమిది లక్షల విలువ గల రెండు గుంటల ఇంటి భూమిని, ఇతర వస్తువులు మౌనిక తల్లి దండ్రలు ఇచ్చారు. కొద్ది రోజుల తర్వాత భర్తతోపాటు అత్తమా మలు మోటర్ సైకిల్ ఇవ్వాలని వేధించారు. గర్భం దాల్చినా వారి వేధింపులు ఆగలేదు. మనస్తాపం చెందిన మౌనిక పది రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. తల్లి ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఇల్లందకుంట ఎస్సై క్రాంతికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

టేకుమట్ల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అంకుషాపూర్ గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన వీరవేణి ఓదెలు వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్రవాహనంపై చిట్యాల మండల కేంద్రానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. అంకుషాపూర్ శివారుకు రాగానే వెనుక వస్తున్న ద్విచక్రవాహనదారుడు ఓవర్‌టేక్ చేసే క్రమంలోఢీకొట్టాడు. దీంతో ఓదెలు పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు ఆయన్ను చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించారు.

గజగజ వణుకుతున్న ఏజెన్సీ

- జిల్లాలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పెరిగిన చలి తీవ్రత
- బయటకు రాలేకపోతున్న జనం


వాజేడులో చలిమంట కాగుతున్న యువకులు, పిల్లలు

ములుగు/వాజేడు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉష్ణోగ్ర తలు రోజు రోజుకూ పడిపోతున్నాయి. దీంతో ప్రజలు చలికి వణుకు తున్నారు. ఉదయం ఇళ్ల లోంచి బయటకు రావాలంటేనే భయప డుతు న్నారు. సాయంత్రం 5 దాటిందంటే రోడ్లపై ఎవరూ కనిపించడంలేదు. ఏజెన్సీ గ్రామాల్లో చలి తీవ్ర మరింత ఎక్కువ ఉంది. ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు మండలాల వారీగా నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయి.. తాడ్వాయి మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 11.2, గరిష్ఠ ఉష్ణోగ్రత 28.7 డిగ్రీలు, గోవిందరావు మండలంలో కనిష్ఠ 11.5, గరిశష్ఠ 29.0, కన్నా యిగూడెం కనిష్ఠ 12.2, గరిష్ఠ 29.8, వాజేడు కనిష్ఠ 12.2, గరిష్ఠ ఉష్ణోగ్రత 29.9, ములుగు మండలంలో కనిష్ఠ 12.4, గరిష్ఠ ఉష్ణోగ్రత 29.3, వెంకటాపూర్ కనిష్ఠ ఉష్ణోగ్రత 13.1, గరిష్ఠ 30.0, జేడీ ి.మల్లంపల్లి మండలంలో కనిష్ఠ 13.1, గరిష్ఠ 29.9 ఏటూరునాగారం మండలంలో కనిష్ఠ 13.5, గరిష్ఠ ఉష్ణోగ్రత 30.3, వెంకటాపురం మండలంలో కనిష్ఠ 13.5, గరిష్ఠ 31.2 డిగ్రీలు, మంగపేట మండలంలో కనిష్ఠ 13.8, గరిష్ఠ ఉష్ణోగ్రత 31.5 డిగ్రీలు నమోదయ్యాయి. గత వారం కంటే ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. ములుగు జిల్లా అడవి ప్రాంతం కావడంతో ఉదయం 8 గంటలు అయినప్పటికీ పలు చోట్ల రహదారులు దట్టమైన పొగమంచు కురుస్తోంది.

యువకుడిపై పోక్సో కేసు

జమ్మికుంట రూరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలికకు మాయ మాటలు చెప్పి వివాహం చేసుకున్న ఓ యువకుడు ఆమెను గర్భిణిని చేసి ఇంటి నుంచి బయటకు గెంటేయగా పోలీసులు అతడిపై పోక్సో కేసు నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పెద్ద కోమటిపల్లిలో చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జమ్మికుంట మండలం పాపక్కపల్లికి చెందిన బాలిక తండ్రి ఏడేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లితోపాటు అమ్మమ్మగారి ఊరైన పెద్ద కోమటిపల్లిలో ఉంటోంది. అదే గ్రామానికి చెందిన వంశీ సదరు బాలికకు మాయ మాటలు చెప్పి ఈ ఏడాది మేలో పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో కట్న, కానుకల కింద ఎకరం భూమి, నాలుగు తులాల బంగారం ఇచ్చారు. కొద్ది నెలలు కలిసి ఉన్న తర్వాత వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. భర్తతోపాటు అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధింపులకు దిగారు. పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. తనను మోసగించి వివాహం చేసుకొని గర్భిణిని చేశాడని బాలిక గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన కార్యదర్శి వెంటనే పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పోక్సో చట్టం కింద యువకుడిపై కేసు నమోదు చేశారు. బాలికను సఖీ కేంద్రంలో చేర్పించారు.

వినతులను పరిష్కరించాలి

ప్రజావాణిలో ములుగు కలెక్టర్ దివాకర


వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి 62 వినతులు స్వీకరించారు. ఇందులో భూసమస్యలకు సంబంధించినవి 17, గృహనిర్మాణ శాఖకు చెందినవి 12, పెన్షన్ 5, ఉపాధి కల్పన ఒకటి, ఇతర శాఖలకు సంబంధించిన 27 వినతులు వచ్చాయి. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెనువెంటనే పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సంబంధిత శాఖల అధికా రులు ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా నమోదు చేసి పరిష్కరించాలని, అవసరమైతే ఫీల్డ్ పరిశీలన కూడా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేష్, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా గురుకులాలు : బీజేపీ

వెంకటాపూర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గురుకులాల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, దీంతో అమాయక పేద పిల్లలు అత్యధికంగా బలి అవుతున్నారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భూక్య జవహర్‌లాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జవహర్‌నగర్ మోడల్‌స్కూల్, హాస్టల్‌లో ప్రత్యేక నిఘా నేత్రాలు, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థినులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాత్రివేళల్లో గుర్తుతెలియని యువకులు హాస్టల్‌లోకి వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించిన తీరు దారుణమని విమర్శించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గురుకులాల వ్యవస్థను పటిష్ఠం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌వో నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని, కలెక్టర్ గురుకులాల విద్యా వ్యవస్థపై నిఘా పెట్టి బాలికల సంరక్షణకు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.

గుర్రేవుల పాఠశాలల్లో క్రీడాపోటీలు

కన్నాయిగూడెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గుర్రేవుల జడ్పీ పాఠశాలతోపాటు ఎంపీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు హైదరాబాద్‌లోని యునైటెడ్ వే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీ చైర్మన్ నర్సమ్మ, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం జమున, ఎంపీపీఎస్ హెచ్‌ఎం వేణుగోపాల్ ఉపాధ్యాయులు శ్యాంసుందర్, పాపయ్య, కవిత, రమేష్, రవీందర్, పీఈటీ కుమారస్వామి, సీఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ర్యాలీని విజయవంతం చేయండి

ములుగు కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 18న మధ్యాహ్నం 12 గంటలకు ములుగులో నిర్వహించే అవగాహన సదస్సు, ర్యాలీని విజయవంతం చేయాలని సంక్షేమ శాఖ జిల్లా అధికారి తుల రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, యువతీ,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

ఏటూరునాగారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు, మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ అనుముల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్సై నరిగా రాజ్‌కుమార్, రెండో ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో మార్కెట్ ఏరియాలోని అన్ని కిరాణా షాపుల్లో నార్కోటిక్ స్నిపర్ డాగ్‌తో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించినా, లేదా చిన్నపిల్లలకు గుట్కా, సిగరెట్లు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరిగిన కారణంగా, వాహనదారులు రాత్రి వేళల్లో, తెల్లవారుజామున ప్రయాణాలు చేయొద్దని సూచించారు. ఇటీవల పొగమంచు కారణంగా అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయని తెలిపారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు గోపి, విక్రమ్, స్నిఫర్ డాగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో లక్ష పసుపు గౌరమ్మల పూజ



లక్ష పసుపు గౌరమ్మ పూజా కార్యక్రమంలో మహిళలు

ఏటూరునాగారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం లక్ష పసుపు గౌరమ్మ పూజా కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం లక్ష పసుపు గౌరమ్మల పూజ సందర్భంగా ఉదయం నుంచి ఆలయ అర్చకులు ఎల్లాప్రగడ రాధకృష్ణ శర్మ, ఆనంద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, కుంకుమ, పసుపు, గౌరమ్మతో పాటు కలశం పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళా భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గౌరిశంకర్, అల్లి శ్రీనివాస్, బోడ సత్యం, పర్వతాల లాలయ్య, రాజు, షైనర్ బాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకులం విద్యార్థి


అజయ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీలు

కాటారం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలకు చెందిన బి.అజయ్ అనే విద్యార్థి ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల మహబూబ్ నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో అజయ్ ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తరపున ఆడి గోల్డ్ మెడల్ సాధించాడు. అత్యంత ప్రతిభ కనబర్చిన అజయ్ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్‌ఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి జైపాల్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం (పెటా) జిల్లా అధ్యక్షుడు సిరంగి రమేష్ తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు కర్ణాటక రాష్ట్రంలోని తుముకూరులో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అజయ్ పాల్గొంటాడని వెల్లడించారు. సోమవారం గురుకులంలో జాతీయ స్థాయికి ఎంపికైన అజయ్‌ను ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్స్ మాధవి, వెంకటయ్య, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేష్ అభినందించారు.

ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ డివిజన్ అధ్యక్షుడిగా చంద్రమౌళి


యామక పత్రాన్ని అందిస్తున్న ఐసీఐ జాతీయ అధ్యక్షురాలు మాధవి

కాటారం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి):ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కాటారం డివిజన్ అధ్యక్షుడిగా ఆర్టీసీ ఉద్యోగి వేల్పుల చంద్రమౌళి నియమితులయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్స్ అకాడమీ కార్యక్రమంలో చంద్రమౌళిని డివిజన్ అధ్యక్షుడిగా నియ మించగా సంస్థ జాతీయ అధ్యక్షురాలు మాధవి నియామకపత్రాన్ని అందించారు. డివిజన్‌లో వచ్చే ఏడాది పాటు యువతలో నాయకత్వ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం పెంపు దల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చంద్రమౌళి తెలిపారు. చంద్రమౌళి నియామకంపై పలువురు ఐసీఐ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

'చలో ఢిల్లీ'కి ఎమ్మార్పీఎస్ నేతలు

మల్హర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం జరుగుతున్న నిరసన సభకు ఎమ్మార్పీఎస్ నేతలు తరలివెళ్లారు. ఆ సంఘం మండల అధ్యక్షుడు కేశారపు నరేష్ ఆధ్వర్యంలో బయల్దేరారు. జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిసూమందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఢిల్లీలో సాగుతున్న నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, చంటి, కుమార్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభం

మల్హర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : తాడిచర్ల నుంచి కిషన్‌రావుపల్లి మీదుగా భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సంబంధించిన రోడ్డు ప నుల్లో భాగంగా సోమవారం చెట్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే ఈ రోడ్డుకు సంబంధించిన అన్ని ఫారెస్టు అనుమతులు రాగా రోడ్డు నిర్మాణంలో పోతున్న చెట్ల లెక్కింపు ప్రక్రియ కూడా పూర్తయ్యింది. కార్యక్రమంలో మాజీ ఎం పీపీ చింతలపల్లి మల్హార్ రావు, రాజునాయక్, నర్సింగరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏడీఈగా శ్రీనివాస్

చిట్యాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ డివిజనల్ ఆఫీసర్‌గా దాసరి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏడీఈ శ్రీనివాస్‌కు స్థానిక కార్యాలయం అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన ఏడీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ తన పరిధిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

గణపురం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో తోడ్పడతాయని సీఐ కరుణాకర్‌రావు అన్నారు. మండలంలోని మాధవరావు పల్లికాలనీలో 12సీసీ కెమరాలను ప్రారంభించారు. సీసీ కెమరాల నిర్వహణ బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. ఎస్సై అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

భూపాలపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో అజ్ఞానం తొలగిపోయి విజ్ఞానం అందుతుందని సీఐ నరేష్‌కుమార్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అధ్యక్షతన సోమవారం జరిగిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సీఐ నరేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఇటీవల మరణించిన తెలంగాణ కవి అందేశ్రీ గారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని అన్నారు. అంధకారాన్ని తెంచే దీపాలు అన్నారు. ఈ కార్యక్రమంలో మహదేవపూర్ పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, ప్రముఖ న్యాయవాది చల్లూరి మధు, భూపాలపల్లి జిల్లాలోని కవులు, కళాకారులు, గడ్డం లక్ష్మణ్, సంజీవరావు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

ప్రజాపాలనలో గ్రామాల సమగ్రాభివృద్ధి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

రేగొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనలో గ్రామాలు సమగ్రాభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రేగొండ మండలంలోని రూపిరెడిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం, కొత్తపల్లిగోరి మండలంలోని చెన్నాపూర్‌లో గ్రామ పంచాయతీ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందు తున్నాయని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు బస్సులను ఇచ్చి ఓనర్లను చేశామన్నారు. రైతులు ఎంతో శ్రమించి పంటల పండిస్తారని, ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేస్తామని అన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు, బుగులోని జాతర చైర్మన్ రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు ఎస్ఎస్ఆర్ సంపత్‌రావు, మాజీ జడ్పీటీసీ సాయిని విజయ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, రేగొండ టౌన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు ఎడ్ల మల్లారెడ్డి, మోడెం ఉమేష్‌గౌడ్, మటిక సంతోష్, శంకరయ్య, కొలెపాక సాంబయ్య, అల్లం శ్రీనివాస్, పున్నం రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అధికారులు దృష్టిపెట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహల్‌శర్మ


ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులు సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ రాహల్‌శర్మ అన్నారు. ఐడీవోసీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం అన్ని శాఖల అధికారుల సమక్షంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు రకరకాల సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చారని, వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఎన్‌డార్స్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా చిట్యాల మండలం ఏఆర్‌పల్లి గ్రామానికి చెందిన ఐలమ్మ లోకోమోటర్ వ్యాధితో బాధపడుతూ నడవలేక పోతున్నానని, తనకు వీల్‌చైర్ ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ డీడబ్ల్యూవోకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఐలమ్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో రవి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, డీడబ్ల్యూవో మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ విధానం తప్పనిసరి

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు బయోమెట్రిక్ విధానాన్ని తప్పనిసరిగా అవలంబించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాలు జారీ చేశారు. ఐడీవోసీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శాఖ అధికారులు తప్పనిసరిగా బయో మెట్రిక్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఈ విధానం ద్వారానే వేతనాలు అందుతాయన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో రవి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపాకలో మృత్యుంజయ హోమం


హోమంలో పాల్గొన్న రేపాక గ్రామస్థులు

రేగొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక గ్రామంలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్ ఆవరణలో సహజానంద స్వామి ఆధ్వర్యంలో రుద్రహోమం, మృత్యుంజయ హోమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమ కార్యక్రమంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. భార్యాభర్తలు పిల్లాపాపలతో కలిసి పూజలు చేయడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. హోమాలు చేయడం వల్ల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండడమే కాకుండా పంటలు సుభిక్షంగా పండుతాయని సహజానంద స్వామి అన్నారు.

ముదిరాజ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్‌లు

భూపాలపల్లిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవాల పోస్టర్‌ను ఆ సంఘం నేతలు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభ జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల రాజమౌళి మాట్లాడుతూ ముదిరాజ్‌లే మత్స్యకారులనే నినాదంతో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ఈ నెల 21న నిర్వహించనున్నామని తెలిపారు. కాగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గాల్లో ముదిరాజ్‌ల భవనాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ కు మార్చాలని అన్నారు. మత్స్యకారులకు వెయ్యి కోట్లు బడ్జెట్ కేటాయించాలని అన్నారు. రూ.300 కోట్లతో 63వేల ద్విచక్ర వాహనాలతో యూనిట్లు మంజూరు చేయాలని అన్నారు. జీవో 98 ప్రకారం అన్ని చెరువులు, కుంటలు, వాగులపై తెనుగు, ముత్తరాశి, ముదిరాజ్, బెస్త, గంగపుత్ర కులాలకు పూర్తిస్థాయి హక్కులు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మత్స్య పారిశ్రామిక జిల్లా చైర్మన్ చిలుకల పాణి, వైస్ చైర్మన్ కిష్టస్వామి, డైరెక్టర్లు సాంబయ్య, ధనుంజయ, కేశవులు, రమేష్, మొగిలి, కుమార్, సమ్మయ్య పాల్గొన్నారు.

రైతు నేస్తం సమావేశానికి హాజరు కావాలి

తాడ్వాయి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరగనున్న రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు రైతులందరూ హాజరు కావాలని వ్యవసాయ శాఖ అధికారి కుమార్ యాదవ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంతో పాటు నార్లాపూర్ రైతు వేదికల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి యాసంగి వరి సాగులో పాటించాల్సిన మొకవలు, రైతుల సందేహాలకు శాస్త్రవేతలు నివృత్తి చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి

(5వ పేజీ తరువాయి)

హెచ్చరించారు. పోలీస్, వైద్య, పంచాయతీ, మునిసిపల్, ఐఎంఏ అధికారులు కలిసి సంయుక్తంగా టీమ్ ఏర్పాటు చేయాలని అన్నారు. రిజిస్ట్రేషన్ కానీ స్కానింగ్ కేంద్రాలు, ల్యాబ్స్ ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పీ నరేష్, డీఎంహెచ్‌వో మధుసూదన్, ఐఎంఏ అధ్యక్షుడు కె.ఎస్. కిరణ్‌కుమార్, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సదానందం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలి

ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. భూపాలపల్లిలోని మంజూర్ నగర్‌లో ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారులకు, రైతులకు, సాధారణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేలా బ్యాంకు సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం తిరుపతి, ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రాణేష్ కుమార్, డిప్యూటీ జోనల్ మేనేజర్ కేశరరావు, జోనల్‌మేనేజర్ సుధాకర్‌రావు, భూపాలపల్లి శాఖ బ్యాంక్ మేనేజర్ ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.